


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4 PM

www.suryaa.com

శుక్రవారం

07 జూన్ 2024

పేజీలు: 02



## మిత్రపక్షాల నేతగా మోదీ ఏకగ్రీవ ఎన్నిక..

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లపై మోదీ ప్రశంసల జల్లు కురిపించారు. పవన్ అంటే పవన్ కాదు ఒక తుఫాన్ అన్నారు. ఏపీలో చంద్రబాబు చారిత్రాత్మక విజయం సాధించారన్నారు. పవన్ వల్లే ఏపీలో భారీ విజయం లభించిందని కీర్తించారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మోదీ ప్రసంగించారు. ముందుగా ఎన్డీయే మిత్రపక్షాల కార్యకర్తలకు శిరసువంచి నమస్కరిస్తున్నానన్నారు మోదీ. ఎన్డీయే గెలుపుకు శ్రమించిన కార్యకర్తలందరికీ అభినందనలు తెలిపారు. ఇవాళ పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్డీయేపక్ష నేతగా నరేంద్రమోదీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోదీ పేరును రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదిస్తే అమిత్‌షా, నితిన్ గడ్కరీ బలపరిచారు. ఎన్డీయేపక్ష నేతగా 3వ సారి ఎన్నికైన నరేంద్రమోదీ.. ప్రధానిగా సేవలు అందించబోతున్నారు. ఎన్డీయే పక్ష సమావేశానికి హాజరైన మోదీ.. రాజ్యాంగానికి ప్రణామం చేసి ఉద్వేగంగా కనిపించారు. ఆ తరువాత పార్లమెంటరీ పక్షనేతగా ప్రసంగించిన మోదీ కార్యకర్తలను ఆకాశానికి ఎత్తేశారు. 22రాష్ట్రాల్లో ఎన్డీయే మిత్రపక్షాలు కలిసి ఉన్నాయన్నారు. విశ్వాసం అనే బంధం తమను కలిపిందని అన్నారు. ఎండనకా, వాననకా కష్టపడి పనిచేసి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తల గురించి ఎంతచెప్పినా తక్కువే అవుతుందన్నారు. అయితే ప్రభుత్వం నడపడానికి అందరి సహకారం అవసరం అన్నారు. అందుకే మిత్రపక్షాల మద్దతు తీసుకున్నానన్నారు.గోవా, ఈశాన్య రాష్ట్రాల్లో క్రైస్తవులు ఎక్కువగా ఉన్నారన్నారు. తనపై నమ్మకంతో దేశ బాధ్యతలు అప్పగించారన్నారు. భారత స్ఫూర్తికి మన ఎన్డీయే కూటమి ఉదాహరణ అన్నారు. ఎన్డీయే అనేది భారతదేశపు ఆత్మ అని కొనియాడారు. ఎన్నికలకు ముందే కూటమి గట్టి విజయం సాధించడం ఒక గొప్ప చరిత్ర అన్నారు. ఇవి నాకు భావోద్వేగ క్షణాలని వివరించారు. ఏపీలో ప్రజలు ఎన్డీయే కూటమికి చారిత్రాత్మక విజయం అందించారన్నారు. తెలుగురాష్ట్రాల్లో ప్రజలు ఎన్డీయేని బలపరిచారని చెప్పారు. గెలుపును ఎంత ఆస్వాధిస్తామో, పరాజితులను కూడా అంతే గౌరవిస్తామన్నారు. ఈ సందర్భంగా ఇండియా కూటమి నేతలను విమర్శించారు. తమిళనాడులో ఎన్డీయే కూటమికి సీట్లు రాకపోవచ్చు.. అక్కడ ఏం జరుగుతుందో ముమ్ముందు ఉంటుందని చెప్పారు.

## లవ్ మౌళి రివ్యూ

అవనీంద్ర దర్శకత్వంలో నవదీప్, పంకూరి గిద్వానీ, చార్వి దత్తా ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'లవ్ మౌళి'. కాగా ఈ చిత్రం ఈ రోజు రిలీజ్ అయింది. మరి సినిమా ఎలా ఉందో సమీక్షలోకి వెళ్లి చూద్దాం.

మౌళి (నవదీప్) చిన్న తనం నుంచి ఒంటరిగా పెరుగుతాడు. మనుషులతో సమాజంతో కలవడానికి కూడా ఇష్టపడడు. ఐతే, తాను మంచి ఆర్టిస్ట్. తను వేసే పెయింటింగ్స్ లో ఎంతో డెప్త్ ఉంటుంది. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో మౌళి వేసిన పెయింటింగ్ ద్వారా చిత్ర (పంకూరి గిద్వానీ) అతని జీవితంలోకి వస్తోంది. ఆమెను మౌళి ఘాడంగా ప్రేమిస్తాడు. ఐతే, కొన్నాళ్ల తర్వాత 'చిత్ర'లో మౌళి కోరుకున్న మార్పులు ఏమిటి ?, అసలు చిత్ర ఎలా ఉండాలని మౌళి ఆశించాడు ?, అందుకోసం మౌళి ఏం చేశాడు ?, ఇంతకీ ప్రేమ అంటే ఏమిటో మౌళి తెలుసుకున్నాడా ? లేదా ? అనేది మిగిలిన కథ.



ఈ సినిమాలో హీరోగా నటించిన నవదీప్ ఈజ్ తో సెటిల్డ్ గా నటించాడు. ముఖ్యంగా కొన్ని కీలక సన్నివేశాల్లో, అలాగే హీరోయిన్ తో సాగే బోల్డ్ అండ్ లవ్ సీన్స్ లో నవదీప్ నటన చాలా బాగుంది. అదేవిధంగా సెకండ్ హాఫ్ లో భావోద్వేగాలను కూడా నవదీప్ ఎమోషనల్ గా బాగా పండించాడు. కొన్నిచోట్ల అతని టైమింగ్ కూడా మంచి ఫన్ ను జనరేట్ చేసింది. ఇక హీరోయిన్ గా నటించిన పంకూరి గిద్వానీ నటన సినిమాకి ప్లస్ అయింది. పంకూరి గిద్వానీ తన నటనతోనూ అలాగే తన గ్లామర్ తోనూ ఆకట్టుకుంది. ముఖ్యంగా మూడు డిఫెరెంట్ షేడ్స్ ఉన్న గెటప్స్ లో ఆమె నటించిన విధానం సినిమాకి ప్లస్ అయ్యింది. మిర్చి కిరణ్ తో పాటు మిర్చి హేమంత్ కూడా తన పాత్రకి పూర్తి న్యాయం చేశాడు. ఇక మిగిలిన నటీనటులు కూడా తమ పాత్ర పరిధి మేరకు బాగానే నటించారు. దర్శకుడు అవనీంద్ర రాసుకున్న మెయిన్ థీమ్ బాగుంది. సినిమా టేకింగ్ లో ఉన్న కొత్తదనం సినిమాలో లేదు. యూత్ కి కనెక్ట్ అయ్యే అంశాలు పెడుతున్నామనుకొని దర్శకుడు అవనీంద్ర ఓవర్ గా ఎక్స్ పోజ్ చేయించి, అనవసరమైన రొమాన్స్ ను ఇరికించాడు. కొన్ని షాట్స్ మినహా అవి కూడా బోర్ గానే సాగాయి. మనుషులతో కలవలేని ఒంటరి హీరో పాత్రకి, భిన్నమైన హీరోయిన్ పాత్రలకు మధ్య సీన్స్ ను ఇంకా చాలా బాగా రాసుకోవచ్చు. కానీ, ఉన్న సీన్స్ కూడా చాలా రెగ్యులర్ గా సాగాయి.

ముఖ్యంగా ఫస్ట్ హాఫ్ లో ప్లే చాలా స్లోగా ఇంట్రెస్ట్ లేకుండా సాగింది. పాత్రల మధ్య ఇంకా బలమైన కాన్ ఫ్లిట్ ను, సన్నివేశాలను రాసుకొని ఉండి ఉంటే బాగుండేది. ఐతే, సినిమా మీద ప్రేక్షకుడికి ఇంట్రెస్ట్ పుట్టించడానికి, దర్శకుడు బోల్డ్ ఎలిమెంట్స్ ను ఎలివేట్ చేసినా అవి పెద్దగా వర్కౌట్ కాలేదు. దీనికి తోడు బలం లేని కథలో బలహీన పాత్రలను సృష్టించి, సినిమా మీద కలిగే ఇంట్రెస్ట్ ను కలగకుండా చేశారు. నటీనటుల నటన బాగున్నా, వాళ్ల పాత్రల్ని తీర్చిదిద్దిన తీరు మాత్రం సినిమాని బలహీనపరిచింది. హీరో నవదీప్ పాత్ర ప్రేక్షకులకి అంతగా కనెక్ట్ కాకపోగా చిరాకు కలిగిస్తుంది. ఇక ప్రతి సన్నివేశం రొటీన్ వ్యవహారాలతోనే చాలా ఊహాజనితంగా సాగుతుంటుంది. మొత్తానికి 'లవ్ మౌళి' ఫస్ట్ హాఫ్ నిరాశ పరిచింది.

ఇక సాంకేతిక నిపుణుల గురించి మాట్లాడుకుంటే.. దర్శకుడు అవనీంద్ర దర్శకుడిగా కొన్ని చోట్ల పర్వాలేదనిపించినా.. రచయితగా విఫలం అయ్యాడు. ఆయన రాసుకున్న స్క్రీన్ ప్లే ఇంట్రెస్ట్ గా సాగలేదు. కాకపోతే తీసుకున్న మెయిన్ పాయింట్ బాగుంది. సంగీత దర్శకుడు గోవింద్ వసంత్ అందించిన సంగీతం పర్వాలేదు. ఇక ఎడిటర్ గా కూడా బాధ్యతలు చేపట్టిన అవనీంద్ర అనవసరమైన సీన్స్ ని ఇంకా టైట్ గా ట్రిమ్ చేసి ఉండి ఉంటే, సినిమాలో చాలా వరకు బోర్ తగ్గేది. సినిమాలో సినిమాటోగ్రఫీ వర్క్ బాగుంది. కొన్ని విజువల్స్ ను చాలా సహజంగా అలాగే చాలా అందంగా చూపించారు. ఫైనల్ గా నిర్మాణ విలువలు మాత్రం బాగున్నాయి.

'లవ్ మౌళి' అంటూ వచ్చిన ఈ రొమాంటిక్ లవ్ ఫాంటసీ డ్రామాలో హీరో – హీరోయిన్ల మధ్య వచ్చే రొమాంటిక్ అండ్ లవ్ సీన్స్ బాగున్నాయి. కానీ కథాకథనాలు ఆకట్టుకునే విధంగా లేకపోవడం, లాజిక్ లెస్ సీన్స్ వంటి అంశాలు సినిమాకి మైనస్ అయ్యాయి. ఓవరాల్ గా, లవర్స్ కు ఈ సినిమాలో కొన్ని సీన్స్ కనెక్ట్ అయినా, మిగిలిన వర్గాల ప్రేక్షకులకు మాత్రం నచ్చకపోవచ్చు.




## ఎన్డీఏ స్టీరింగ్ చంద్రబాబు చేతుల్లో

బీజేపీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో ప్రధాని మోదీపై కాంగ్రెస్ పార్టీ సెటైరికల్ పోస్టులతో విరుచుకుపడుతోంది. 'ఈసారి ఎన్డీఏ ప్రభుత్వంలో మోదీ పాత్ర నామమాత్రమే. స్టీరింగ్ చంద్రబాబు, నితీశ్ చేతుల్లోనే' అని అర్థం వచ్చేలా తాజాగా ఓ సెటైరికల్ ఫొటోను పోస్ట్ చేసింది. అందులో ఆటోను చంద్రబాబు డ్రైవింగ్ చేస్తున్నట్లు ఉండగా వెనకాల మోదీ దిగాలుగా ఉన్నారు. దీనికి '400 పార్ రవాణా సేవలు' అని క్యాప్షన్ ఇచ్చింది.



## అవినీతి ఆరోపణలతో కర్ణాటక మంత్రి రాజీనామా

మనీలాండరింగ్ ఆరోపణలతో కర్ణాటక మంత్రి బి.నాగేంద్ర తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను సీఎం సిద్దరామయ్యకు సమర్పించగా, ఆయన దాన్ని గవర్నర్‌కు పంపించారు. నిధుల దుర్వినియోగానికి తమను సీనియర్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని KMVSTDC బోర్డు సూపరింటెండెంట్ చంద్రశేఖర్ సూసైడ్ నోట్ రాసి మే 26న ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో ఆ శాఖ మంత్రి బి.నాగేంద్రపై మనీలాండరింగ్ ఆరోపణలు మొదలయ్యాయి.



## కేసీఆర్ అనుకున్నారు.. చంద్రబాబుకు సాధ్యమైంది!

కేంద్రంలో చక్రం తిప్పాలని బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కలలు కన్నారు. కానీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఘోర ఓటమితో ఆ పార్టీ రాష్ట్రంలోనే మనుగడ కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటు ఏపీలో ఘనవిజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పుడు కేంద్రంలో కీలకంగా మారారు. బీజేపీకి సరిపడా ఆధిక్యం రాకపోవడంతో 16 సీట్లతో చంద్రబాబు కింగ్ మేకర్ అయ్యారు. ఆయన మద్దతుతోనే ఇప్పుడు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేఅధికారం చేపట్టబోతోంది.



## వైసీపీకిమాజీమంత్రి కిశోర్‌బాబు రాజీనామా..

ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కోల్పోయిన వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మాజీ మంత్రి రావెల కిశోర్ బాబు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈమేరకు పార్టీ అధినేత జగన్‌కు రాజీనామా లేఖ పంపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు రాజ్యాధికారం వైసీపీతోనే సాధ్యమని పార్టీలో చేరానని, అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీని ప్రజలు తిరస్కరించారని అందులో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేసేందుకు వైసీపీని వీడుతున్నట్లు వెల్లడించారు. సంక్షేమం, సమగ్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని కూటమికి చారిత్రక విజయం సాధించిపెట్టారని చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా సమర్థవంతంగా పనిచేసి పేద ప్రజలకు సేవచేశానని తెలిపారు. దురదృష్టవశాత్తూ కొన్ని కారణాల వల్ల టీడీపీలో కొనసాగలేకపోయానని చెప్పారు. త్వరలోనే ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం లభిస్తుందని విశ్వస్తున్నాని తెలిపారు.

## గెలుపు దిశగా తీన్మార్ మల్లన్న

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం ఉత్కంఠ రేపుతున్నది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయినప్పటికీ ఫలితం ఇంకా తేలలేదు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఇప్పటివరకు ఆయనకు 1,23,210 ఓట్లు వచ్చాయి. విజయం సాధించాలంటే మరో 32 వేల ఓట్లు అవసరమున్నది. ఇక రెండో స్థానంలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి 1,04,514 ఓట్లు వచ్చాయి. బీజేపీ బలపరిచిన ప్రేమేందర్ రెడ్డికి 43,486, స్వతంత్ర అభ్యర్థి అశోక్ గౌడ్‌కు 29,776 ఓట్లు పోలయ్యాయి. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో 33 మంది అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యారు. 33 మంది అభ్యర్థుల రెండో ప్రాధాన్యత ఓట్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు పోటాపోటీగా ఓట్లు షేర్ అయ్యాయి. కాగా, బీజేపీ అభ్యర్థి ఎలిమినేషన్ తర్వాతే ఫలితంపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది. మ్యాజిక్ ఫిగర్‌కు 1,55,095 ఓట్లు రావాల్సి ఉన్నది. సాయంత్రం తర్వాత తుది ఫలితం రానుంది.





## కవితపై సీబీఐ ఛార్జ్‌షీట్

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవితపై రౌస్ అవెన్యూ కోర్టులో సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. దీనిపై కోర్టు విచారణ చేపట్టింది. ఇక సీబీఐ కేసులో కవిత జుడీషియల్ కస్టడీ నేటితో ముగిసింది. కస్టడీ పొడిగింపుపై మధ్యాహ్నం 2 గంటలకు కోర్టు విచారణ చేపట్టనుంది. కవిత ప్రస్తుతం తిహార్ జైలులో ఉన్న విషయం తెలిసిందే.

## సత్యభామ రివ్యూ

తెలుగులో సినిమాల సీజన్ మొదలైపోయింది. వారం వారం మూడు సినిమాలు చొప్పున ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. ఈ వారం ఆ సంఖ్య ఇంకా ఎక్కువే. వీటిలో ఒకటి... 'సత్యభామ'. నాయికా ప్రధానమైన ఈ సినిమాలో కాజల్ ప్రధాన పాత్ర పోషించారు. హిట్ సినిమాల దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పణలో, ఆయన స్క్రీన్‌ప్లే రచనలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ప్రచార చిత్రాలు ఆసక్తిని రేకెత్తించాయి. మరి చిత్రం ఎలా ఉంది?కాజల్ యాక్షన్ మోడ్‌లో అదరగొట్టిందా?

కథేమిటంటే: కె. సత్యభామ షి టీమ్‌లో ఏసీపీ స్థాయిలో పనిచేస్తుంటారు. చూడటానికి శాంతంగా కనిపించినా, నేరస్థుల నుంచి నిజాలు రాబట్టడంలో దిట్ట. తనకు అప్పజెప్పిన కేసుల్ని అంత సులభంగా వదిలిపెట్టదని పేరు. రచయిత అమరేందర్ (నవీన్‌చంద్ర)ని ఇష్టపడి పెళ్లి చేసుకున్న ఆమె వ్యక్తిగత జీవితానికంటే, వృత్తికే ఎక్కువ సమయం కేటాయిస్తుంటుంది. షి టీమ్‌లో పనిచేస్తున్నప్పుడే హసీనా అనే ఓ బాధితురాలు గృహ హింసని అనుభవిస్తూ సాయం కోసం సత్యభామ దగ్గరికి వస్తుంది. నీకేం కాదు, అంతా నేను చూసుకుంటానని ధైర్యం చెప్పి పంపించాక, భర్త చేతిలో దారుణ హత్యకి గురవుతుంది. హసీనా హత్య సత్యభామని ఎంతో కలచివేస్తుంది. హసీనాతోపాటు, ఎంతో మంది జీవితాలతో ఆడుకున్న ఆ నేరస్థుడిని పట్టుకునే క్రమంలో సత్యభామకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఆ కేసుని ఆమె వ్యక్తిగతంగా తీసుకోవడానికి కారణమేమిటి? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

ఎలా ఉందంటే: పరిశోధన ప్రధానంగా సాగే ఓ క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ తరహా కథలు ఈ మధ్య తెలుగులో తరచూ వస్తున్నాయి. ఓ నేరం చోటు చేసుకుంటుంది. అది ఎవరు చేశారనేది అంతుచిక్కదు. ఎలాంటి ఆధారాలు దొరక్కుండా అత్యంత పకడ్బందీగా చేసిన ఆ నేరం వెనక గుట్టుని విప్పేందుకు ఓ పోలీస్ అధికారో లేదంటే ఓ డిటెక్టివో లేదంటే, బాధితుడో లేక అతని తాలూకూ వ్యక్తులో రంగంలోకి దిగుతుంటారు. ఆ క్రమంలో ఎదురయ్యే సవాళ్లు, వెలుగులోకి వచ్చే అసలు నిజాలు, కేసు ముడి వీడే క్రమం ఎలా సాగిందనేదే ఈ కథలకి కీలకం. 'సత్యభామ' కూడా ఆ తాను ముక్కే. కాకపోతే ఇక్కడ నేరం ఎవరు చేశారనేది ముందే తెలిసిపోతుంది. అతన్ని వెతికి పట్టుకోవడమే పని. పైగా కేస్‌ని ఛేదించేది ఓ మహిళా పోలీస్ అధికారి. ఆమె కేస్‌ని వ్యక్తిగతంగా తీసుకునే క్రమంలో పండిన భావోద్వేగాలు ఈ సినిమాని కాస్త ప్రత్యేకంగా మార్చేశాయని చెప్పుకోవాలి. కొత్త కథేమీ కాదు కానీ, ఇలాంటి సినిమాలకి కథనమే కీలకం. మంచి రచయితగా పేరున్న శశికిరణ్ తిక్క కథనం పరంగా తనదైన ప్రభావం చూపించే ప్రయత్నం చేశారు.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## కన్నప్పలో శ్రియా రెడ్డి?



టాలీవుడ్ హీరో మంచు విష్ణు హీరోగా నటిస్తున్న లేటెస్ట్ భారీ పాన్ ఇండియా చిత్రం "కన్నప్ప". ఈ చిత్రం కోసం విష్ణు కఠినంగా కష్టపడుతున్నాడు. అయితే తాజా అప్ డేట్ ప్రకారం, ఈ సినిమాలో నటి శ్రియా రెడ్డి ఓ కీలక పాత్ర పోషిస్తుందని రూమర్స్ వినిపిస్తున్నాయి. సలార్ తర్వాత శ్రియా రెడ్డి రేంజ్ పెరిగింది. పైగా నెగెటివ్ షేడ్స్ కలిగిన పాత్రలలో ఆమె నటించి మంచి పేరు తెచ్చుకుంది. మరి కన్నప్ప చిత్రంలో శ్రియా రెడ్డి ఏ పాత్రలో నటిస్తోందో చూడాలి. ఇప్పటికే, కన్నప్ప లో ప్రభాస్, అక్షయ్ కుమార్ మరియు మోహన్ లాల్ కూడా పవర్ ఫుల్ పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ప్రీతి ముకుందన్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తోంది. ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామాకి మహా భారత్ సీరియల్‌ని డైరెక్ట్ చేసిన ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా పై అంచనాలు ఎక్కువగానే ఉన్నాయి.

## ఏపీ నూతన సీఎస్‌గా నీరభ్‌కుమార్ ప్రసాద్



ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి నీరభ్ కుమార్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 1987 బ్యాచ్‌కు చెందిన ఆయన.. ప్రస్తుతం రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు సీఎస్‌గా ఉన్న కె.ఎస్.జవహర్‌రెడ్డి గురువారం సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో నూతన సీఎస్ నియామకం జరిగింది. కొత్త సీఎస్ నియమాకం జరిగినందున జవహర్‌రెడ్డిని బదిలీ చేశారు. బుధవారం ఉదయం తెదేపా అధినేత చంద్రబాబును నీరభ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి వెళ్లారు.



## ఏపీ అసెంబ్లీ స్పీకర్ ఎవరు?

ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా ఎవరు నియమితులవుతారనే దానిపై చర్చ మొదలైంది. ఉండి నియోజకవర్గం నుంచి గెలిచిన కనుమూరి రఘురామకృష్ణ రాజు తనకు ఈ పదవి కావాలని టీడీపీ అధినేత చంద్రబాబును కోరుతున్నట్లు తెలుస్తోంది. అటు నెల్లూరు(డీ) ఆత్మకూరు నుంచి గెలిచిన ఆనం రామనారాయణరెడ్డి, చీపురుపల్లి నుంచి గెలిచిన కళా వెంకట్రావు పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం అనంతరం దీనిపై స్పష్టత రానుంది.



## మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు

గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ ప్రియమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహానికి డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా ధరలు పుంజుకున్నాయి. గురువారం ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం పుత్తడి ధర రూ.680 ఎగబాకి మళ్లీ 73 వేలు దాటి రూ.73,500కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.72,820గా ఉన్నది. వెండి ర్యాలీ కొనసాగించింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో కిలో వెండి ఏకంగా రూ.1,400 అందుకొని రూ.91,900 నుంచి రూ.93,300కి చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం బంగారం ధర రూ.770 అధికమై రూ.73,420కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.700 ఎగబాకి రూ.67,300కి చేరుకున్నది. కిలో వెండి రూ.1,800 ఎగబాకి రూ.98 వేలకు చేరుకున్నది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 28 డాలర్లు పెరిగి 2,360 డాలర్లకు చేరుకోగా, వెండి 30.30 డాలర్లుగా నమోదైంది.

## ఆ జనాల ఓట్లు ఏమయ్యాయి?



లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటూ రాకపోవడంపై బీఆర్ఎస్ సమాలోచనల్లో పడింది. కేసీఆర్ బస్సు యాత్రకు తండోపతండాలుగా జనం వచ్చారు. కానీ అవన్నీ ఓట్ల రూపంలోకి బదిలీ కాకపోవడంతో లోపం ఎక్కడ జరిగిందన్న చర్చ మొదలైంది. ముఖ్యంగా పార్టీలోనే ఉంటూ వెన్నుపోటు పొడిచిన వారిని వదిలిపెట్టొద్దంటూ అధినేతకు అనుచరులు సూచిస్తున్నారట. దీంతో ఇకపై అనుసరించాల్సిన వ్యూహాలపై గులాబీ బాస్ ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది.

## మనమే రివ్యూ

చార్మింగ్ స్టార్ శర్వానంద్ నటించిన లేటెస్ట్ మూవీ 'మనమే'. ఈ సినిమాను శ్రీరామ్ ఆదిత్య తెరకెక్కించాడు. కాగా ఈ చిత్రం ఈ రోజు విడుదల అయింది. మరి ప్రేక్షకులను ఈ చిత్రం ఏ మేరకు మెప్పించిందో రివ్యూలోకి వెళ్లి తెలుసుకుందాం!

విక్రమ్ (శర్వానంద్) సరదాగా తిరుగుతూ తాగుతూ అమ్మాయిలతో ఎంజాయ్ చేస్తూ ఉంటాడు. ఐతే, విక్రమ్ ఫ్రెండ్ అనురాగ్ అతని భార్య ఓ ప్రమాదంలో చనిపోతారు. వారి కొడుకు అనాథగా మిగిలిపోతాడు. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో విక్రమ్ సుభద్ర (కృతి శెట్టి) ఆ పిల్లాడికి నాలుగు నెలల పాటు కేర్ టేకర్స్ గా ఉండాల్సి వస్తోంది. ఈ క్రమంలో జరిగిన కొన్ని సంఘటనల కారణంగా విక్రమ్ సుభద్రతో ప్రేమలో పడతాడు. కానీ, అప్పటికే సుభద్రకి మరొకరితో పెళ్లి ఫిక్స్ అవుతుంది. మరి సుభద్ర కోసం విక్రమ్ ఏం చేశాడు ?, తన ప్రేమను గెలిపించుకున్నాడా? లేదా ?, చివరకు సుభద్ర – విక్రమ్ ఒక్కటయ్యారా ? లేదా ? అనేది మిగిలిన కథ.

డీసెంట్ కాన్సెప్ట్ తో పాటు ఫీల్ గుడ్ ఫ్యామిలీ సీన్స్ మరియు ఎమోషనల్ గా సాగే లవ్ ఎమోషన్స్.. ఈ మనమే సినిమాకి హైలైట్స్ గా నిలిచాయి. ముఖ్యంగా శర్వా - కృతి మధ్య లవ్ సీన్స్, అలాగే మాస్టర్ విక్రమ్ ఆదిత్య పాత్ర ట్రాక్.. ఆ పాత్ర ద్వారా హీరోహీరోయిన్లను కలపడం వంటి అంశాలు బాగున్నాయి. విక్రమ్ పాత్రలో శర్వానంద్ చక్కని నటనను కనబరిచాడు. సెకండ్ హాఫ్ లో ఓ సగటు తండ్రిగా చాలా బాగా నటించాడు. ముఖ్యంగా ఎమోషనల్ సన్నివేశాల్లో సెటిల్డ్ పెర్ఫార్మెన్స్ తో తన పాత్రకి శర్వానంద్ పూర్తి న్యాయం చేశాడు. మెయిన్ గా క్లైమాక్స్ సీక్వెన్స్ లో శర్వానంద్ నటన సినిమాకే




హైలెట్ గా నిలుస్తోంది. అలాగే శర్వానంద్ కి – కృతి శెట్టి కి మధ్య కెమిస్ట్రీ కూడా బాగానే అలరిస్తుంది. ఇక కథానాయకగా నటించిన కృతి శెట్టి తన పాత్రలో చాలా చక్కగా నటించింది. తన స్క్రీన్ ప్రెజెన్స్ తో పాటు తన నటనతోనూ ఆమె ఆకట్టుకుంది. అతిథి పాత్రలో సీరత్ కపూర్ ఆకట్టుకుంది. మెయిన్ గా అయేషా ఖాన్ తన గ్లామర్ తో మెప్పించింది. మాస్టర్ విక్రమ్ ఆదిత్య తన క్యూట్ లుక్స్ తో మెప్పించాడు. అలాగే వెన్నెల కిషోర్, రాహుల్ రామకృష్ణ తమ నాచ్యురల్ నటనతో ఆకట్టుకున్నారు. ఎప్పటిలాగే తన శైలి పాత్రలో కనిపించిన సుదర్శన్ కూడా బాగానే నటించాడు. శివ కందుకూరితో పాటు మిగిలిన నటీనటులు కూడా తమ పాత్ర పరిధి మేరకు బాగా నటించారు. దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య తీసుకున్న కథాంశం బాగున్నప్పటికీ.. కథనం మాత్రం కొన్ని చోట్ల సింపుల్ గా స్లోగా సాగుతుంది. ముఖ్యంగా సెకండ్ హాఫ్ లోని ఫ్యామిలీ సీక్వెన్సెస్ అలాగే కొన్ని లవ్ సీక్వెన్సెస్ ఆసక్తికరంగా సాగలేదు. ఇక హీరోహీరోయిన్ల మధ్య వచ్చే డ్రామా కూడా రెగ్యులర్ గానే సాగింది. మొత్తానికి దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య తాను అనుకున్న కంటెంట్ ను స్క్రీన్ మీద బాగా ఎలివేట్ చేసినా.. సినిమాలో కొన్ని రొటీన్ సీన్స్ ను ట్రిమ్ చేసి వుంటే సినిమాకి ఇంకా ప్లస్ అయ్యేది. అలాగే, శ్రీరామ్ ఆదిత్య స్క్రీన్ ప్లే విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాల్సింది, ఇంటర్వెల్ లో ఓ చిన్న కాన్ ఫ్లిక్ట్ ఇచ్చి... సెకండాఫ్ పై కొంత ఇంట్రెస్ట్ పెంచే ప్రయత్నం చేసినా.. అది అంత ఎఫెక్టివ్ గా వర్కౌట్ కాలేదు.



## మళ్లీ ప్రారంభమైన ప్రజావాణి.. ప్రజాభవన్‌కు క్యూకట్టిన జనాలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం నేడు పున: ప్రారంభమైంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ వల్ల తాత్కాలికంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే గురువారంతో ఎలక్షన్ కోడ్ ముగియడంతో నేటి నుంచి ప్రజావాణి అర్జీల స్వీకరణ కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జీ చిన్నారెడ్డి తెలిపారు.గతంలో వలే మంగళ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలను అర్జీల ద్వారా ప్రభుత్వ దృష్టి తీసుకురావాచ్చన్నారు.ప్రజావాణిలో వచ్చిన వినతులకు అధిక ప్రాధాన్యతనిచ్చి సత్వర పరిష్కారాలు చూపాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కాగా, ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ప్రతిరోజూ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తాను కూడా ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తానని తెలిపారు. అయితే మొదటి రోజు మినహా ఆయన ఎప్పుడూ ఈ కార్యక్రమంలో పాల్గొనకపోవడం గమనార్హం. అదేవిధంగా రోజూ నిర్వహిస్తామన్న కార్యక్రమాన్ని వారంలో రెండు రోజులకు కుదించారు.



సునీల్ ఛెత్రి కెరీర్
మ్యాచ్‌లు 151, గోల్స్ 94

### వీరుడి వీడ్కోలు.. భారత్‌కు ఆఖరి మ్యాచ్

## ఆడేసిన సునీల్ ఛెత్రి

సుదీర్ఘ భారత ఫుట్‌బాల్ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది. కండ్లు చెదిరే ఆటతీరుతో కోట్లాది అభిమాన గణాన్ని సొంతం చేసుకున్న దిగ్గజ ఫుట్‌బాలర్ సునీల్ ఛెత్రి ఆటకు వీడ్కోలు పలికాడు. తన 19 ఏండ్ల ఫుట్‌బాల్ కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెడుతూ చెమర్చిన కండ్లతో మైదానాన్ని వీడాడు. గురువారం చారిత్రక సాల్ట్‌లేక్ స్టేడియం వేదికగా కువైట్‌తో జరిగిన వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో సునీల్ బరిలోకి దిగాడు. విజయంతో తన అసమాన కెరీర్‌కు అద్భుతమైన ముగింపు పలుకుతాడనుకున్న ఛెత్రికి.. కువైట్‌తో పోరు 0-0తో డ్రా కావడం ఒకింత నిరాశ కల్గించింది. తదుపరి రౌండ్‌కు అర్హత సాధించాలంటే తప్పక గెలువాల్సిన మ్యాచ్‌లో బ్లూ టైగర్స్ అవకాశాలను అందిపుచ్చుకోలేకపోయారు. మ్యాచ్ జరుగుతున్న సేపు స్టేడియంలో ఉన్న 68,000 మంది ప్రేక్షకులు సునీల్..సునీల్..వందేమాతరం అంటూ దిక్కులు పిక్కటిల్లేలా స్లోగన్‌లు చేశారు. గత పోరులో కువైట్‌పై 1-0తో విజయం సాధించిన టీమ్‌ఇండియా..అదే ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయింది. 2005లో పాకిస్థాన్‌పై సునీల్ ఛెత్రి అరంగేట్రం మ్యాచ్ 1-1 డ్రా కాగా, ఆఖరి పోరు అదే విధంగా ముగియడం విశేషం.

## తెలుగులో రీఎంట్రీకి రెడీ



రీసెంట్‌గా భర్తతో కలిసి సొంతంగా చిత్ర నిర్మాణం కూడా మొదలుపెట్టిన జెనీలియా.. తన భర్త రితేష్‌తో కలిసి మరాఠీలో 'వేద్' అనే సినిమాలో నటించింది. తెలుగులో వచ్చిన 'మజిలీ'.. ఈ 'వేద్'కు మాతృక కావడం విశేషం. 'మజిలీ'లో సమంత పాత్రను 'వేద్'లో జెనీలియా చేసి, మరాఠీ ప్రేక్షకుల కితాబులందుకుంది.ఇక అసలు విషయానికొస్తే, మంచి పాత్ర దొరికితే తెలుగులోనూ నటించడానికి రెడీ అని స్టేట్‌మెంట్ ఇచ్చేసింది జెనీలియా. అయితే.. తను తెలుగులో హీరోయిన్‌గా చేస్తుందా? లేక ప్రత్యేక పాత్రలు చేస్తుందా? అనేది తెలియాల్సివుంది. నిజానికి జెనీలియా కంటే సీనియర్లయిన త్రిష, నయనతార నేటికీ హీరోయిన్లుగా చలామణీ అవుతున్నారు. వీరిలో నయన్ కూడా ఇద్దరు పిల్లల తల్లే. అలాంటప్పుడు ఇప్పటికీ అందంగానే ఉన్నా జెనీలియా హీరోయిన్‌గా ఎందుకు చేయకూడదని ఆమె అభిమానులు అభిప్రాయపడుతు న్నారు. చూద్దాం.. 'హాసిని' తెలుగు ఎంట్రీ ఎలా ఉంటుందో..



### ఎంపీల్లో 93%మంది

## కోటీశ్వరులే: ఏడీఆర్

సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల్లో 93శాతం మంది కోటీశ్వరులేనని 'అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్' (ఏడీఆర్) తెలిపింది. గత ఎంపీల్లో 475 మంది మిలియనీర్లు ఉండగా, వీరి సంఖ్య ఈసారి 504కు పెరిగిందని వెల్లడించింది. ధనిక ఎంపీల్లో గుంటూరు టీడీపీ అభ్యర్థి చంద్రశేఖర్ పెమ్మసాని రూ.5,705 కోట్లతో మొదటి స్థానంలో ఉండగా, చేవెళ్ల బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి రూ.4,568 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో ఉన్నారని తెలిపింది. 543 మంది ఎంపీల్లో 251 మందిపై (46శాతం) క్రిమినల్ కేసులున్నాయని, ఇందులో 27 మంది దోషులుగా తేలారని ఏడీఆర్ తెలిపింది. క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న అభ్యర్థులు లోక్‌సభకు ఈ స్థాయిలో ఎంపిక కావటం ఇదే మొదటిసారి అని పేర్కొన్నది.



## బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో 9 కిలోల బంగారం పట్టివేత

కర్ణాటక రాజధాని బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో భారీగా బంగారం పట్టుబడింది. రెండు వేర్వేరు ఘటనల్లో దాదాపు రూ.6.29 కోట్ల విలువైన 9 కిలోల బంగారాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.డీఆర్ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ బంగారాన్ని మంగళవారం సీజ్ చేశారు. ముందుగా ఓ సిండికేట్ థాయ్ ఎయిర్‌వేస్ విమానంలో బంగారాన్ని దాచినట్లు డీఆర్ఐ అధికారులకు ముందుగా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు ఆ విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఫలితంగా 6.834 కిలోల బంగారాన్ని గుర్తించారు. విమానంలో వదిలేసిన హ్యాండ్ బ్యాగ్‌లో ఈ బంగారాన్ని గుర్తించారు. బ్యాగ్‌లోని పత్రాల ఆధారంగా ప్రయాణికులను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా.. విమానంలో బంగారాన్ని దాచినట్లు వారు అంగీకరించారు. ఈ బంగారం విలువ రూ.4.77 కోట్లుగా అంచనా వేస్తున్నారు.

## వైద్యశాఖలో 5,348 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

వైద్య, ఆరోగ్యశాఖలో 5,348 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో ఉద్యోగాల భర్తీ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నియామకాల ప్రక్రియ వైద్య, ఆరోగ్యసేవల రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా జరగనుంది. ఈ రిక్రూట్‌మెంట్‌లో డాక్టర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఏఎన్ఎం వంటి పోస్టులున్నాయి.